క్లుప్తంగా

చెక్కుల పంపిణీ

మణుగూరురూరల్: పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆదేశాల మేరకు మణుగూరు మున్సిపాలిటీ పరిధి భగత్‌సింగ్‌నగర్, పైలట్‌కాలనీలకు చెందిన నలుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు మంజూరైన చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. మన్నూరు భాగ్యలక్ష్మికి రూ.20వేలు, జక్కుల సౌజన్యకు రూ.22వేలు, చిన్నాల వెంకటమ్మకు రూ.60వేలు, వెన్నం శివకుమార్‌కు రూ.18వేల చొప్పున చెక్కులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు కాగా.. వాటిని మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహరావు చేతుల మీదుగా క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు అడపా అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి నవీన్, నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ఎడ్ల శ్రీనివాస్, బాబ్‌జాని, ముద్దంగుల కృష్ణ పాల్గొన్నారు.

వలంటీర్లకు శిక్షణ

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామంలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో వలంటీర్లకు ఎయిడ్స్ వ్యాధిపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ సూపర్ వైజర్ మధుబాబు హెచ్‌ఐవి ఎలా సోకుతుంది, వ్యాధి లక్షణాలు, చికిత్స, గ్రామ వలంటీర్‌ల బాధ్యతపై శిక్షణ ఇచ్చారు. లింక్ వర్కర్ జరీనా మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొల్లి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయనిర్మల, వనజాక్షి, సరళ, వీరకుమారి యువత పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

బూర్గంపాడు: రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా, దిశాయ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో బూర్గంపాడులోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించిన అనంతరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ భాస్కర్‌రావు, డా విజయ్‌కుమార్, ఎస్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, సాయిరామ్, గిరీష్, ఖాదర్, ఎం.శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, మురళి, దిలీప్, మహేష్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఏరియా ఆస్పత్రి హోమియో విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కళాశాలలోని జంతుశాస్త్ర విభాగం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు వెల్లడించండి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపిక నిబంధనలను తెలియజేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట భద్రాద్రి యువజన అభివృద్ధి ఫోరం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి యువజన ఫోరం గౌరవ అధ్యక్షుడు గడ్డం రాము మాట్లాడారు. ఇళ్ల పంపిణీకి సంబంధించిన నిబంధనలను తహసీల్దార్‌ను కోరామని, ఆయన పూర్తి స్థాయిలో చెప్పేందుకు నిరాకరించారని ఆరోపించారు. కార్యక్రమంలో చింత నాగముత్యం, నారాయణ, ప్రతాపరుద్రుడు, శ్రీను, విజయలక్ష్మి, ఉద్దిశ వీరమణి, సుజాత పాల్గొన్నారు.

చైర్మన్, సీఈఓదే బాధ్యత

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 2021–22 ఏడాది ఆడిట్‌లో రూ.20 లక్షలు దుర్వినియోగం, అవకతవకలకు సహకార సంఘం చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, సీఈఓ రామారావు బాధ్యత వహించాలని సంఘం డైరెక్టర్లు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. మొండికుంటలోని సంఘం కార్యాలయంలో చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు.సంఘంలో అవకతవకలపై చర్చించారు. నిధుల దుర్వినియోగానికి చైర్మన్, సీఈఓ బాధ్యత వహిస్తూ.. మొదటి విడతగా తలా రూ.5 లక్షలు చొప్పున కట్టాలని డైరెక్టర్లు కోరగా చైర్మన్, సీఈఓ తాము అవకతవకలు, దుర్వినియోగం చేయాలేదంటూ.. సమావేశం నుంచి అర్ధాంతరంగా వెళ్లినట్టు సమాచారం.

ఉద్యమించాలి..

దుమ్ముగూడెం: ఆదివాసీ చట్టాలను కాపాడే దిశగా ఆదివాసీలు ఉద్యమించాలని ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని చిన్న కమలాపురం గ్రామంలో కోరం రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ చట్టాలను భగ్నం చేసేందుకు కొందరు గిరిజనేతరులు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానానికి అనుగుణమైన చట్టాలకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సోయం వినోద్, కుర్సం మహేష్, తుర్స చంటి, ధర్మరాజు, వెంకట్, రామకృష్ణ ప్రసాద్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా బల్దియా పాలన

- కమీషన్ వచ్చే పనులపైనే అధికారుల దృష్టి
- పన్నుల వసూలుకు అధిక ప్రాధాన్యత
- ప్రజాసమస్యలు గాలికి..



మూలన పడేసిన విలువైన యంత్రాలు



మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయం..

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ గందరగోళంలో కొనసాగుతుంది. సరైన అధికారులు లేకపోవడంతో ఇక్కడ ఉన్నవారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో ప్రజాసమస్యలకు సరైన పరిష్కారం దొరకడంలేదని మున్సిపాలిటీలోని ప్రజలు వాపోతున్నారు. మణుగూరు మున్సిపాలిటీకి పూర్తిస్థాయిలో మున్సిపల్ కమిషనర్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ఇన్‌చార్జ్‌ల పాలనతో అస్తవ్యస్తంగా, అవినీతికి నిలయంగా మారుతోందని అభిప్రాయపడుతున్నారు. మున్సిపాలిటీలోని కొందరు కాంట్రాక్టు ఉద్యోగులు చక్రం తిప్పుతూ వారికి నచ్చిన వారిని ఇక్కడ ఏర్పాటు చేయించుకుంటూ మున్సిపాలిటీని తమ ఇష్టానుసారంగా నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ఆర్‌ఐగా విధులు నిర్వహించి అవినీతితో సస్పెండ్ అయిన వ్యక్తిని ఇక్కడ తిరిగి కమిషనర్‌గా ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

సమస్యలు పట్టని అధికారులు

మణుగూరు మున్సిపాలిటీలో ప్రజాసమస్యలు ఏమాత్రం పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం కార్యాలయానికి తమ సమస్యలతో వచ్చిన ప్రజలను ఎవరు పట్టించుకోవడంలేదని, కేవలం అధికారులకు కమీషన్ వచ్చే పనులు మాత్రమే పట్టించుకుంటున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

మూలనపడిన యంత్రాలు

మున్సిపాలిటీలో గతంలో కొనుగోలు చేసిన అనేక రకాల యంత్రాలు మూలనపడి ఉన్నా వాటికి మరమ్మతులు చేసి ప్రయోజనకరంగా చేయడంలేదు. అధికారులు మారినప్పుడల్లా పెద్దసంఖ్యలో యంత్రాలు కొనుగోలు చేయడం వాటికి చిన్న మరతమ్మతులు వచ్చినా పట్టించుకోకపోవడం పరిపాటి అయింది. ఈ విధంగా మున్సిపాలిటీ ధనం వృథా అవుతోంది.

ప్రజలపై పన్నుల భారం..

ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరును మున్సిపాలిటీగా కాకుండా పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంఘాలు ఎప్పటినుంచో మొరపెడుతున్నారు. దానిని పట్టించుకోకపోగా.. మున్సిపాలిటీ పేరుతో ప్రజలపై అధిక పన్నులు వసూలు చేస్తున్నారు. అధిక ఇంటి పన్నులతోపాటు చెత్త సేకరణ పేరుతోను అధిక పన్నులు రుద్దుతున్నారు. ఇలాంటి పరిస్థితిని రూపుమాపి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని స్థానికులు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి



మణుగూరు మున్సిపాలిటీలో ఉన్న గందరగోళ పరిస్థితిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా స్వలాభం కోసం పనిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. అవినీతి అధికారులను అందలం ఎక్కించడం వల్ల ఇక్కడ మరింత అవినీతి అక్రమాలకు నిలయంగా మారుతోంది. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– సుధాకర్, సీపీఐ పట్టణ కార్యదర్శి, మణుగూరు

అక్రమాలపై విచారణ చేపట్టాలి



మణుగూరు మున్సిపాలిటీలోని అధికారులు అవినీ అక్రమాలపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేపట్టాలి. మున్సిపాలిటీకి రెగ్యులర్ కమిషనర్‌ను ఏర్పాటు చేసి ఇన్‌చార్జ్‌ల పాలనపై విముక్తి కలిగించాలి. అవినీతి అక్రమాలకు దూరంగా ఉంటూ ప్రజా సమస్యలపై దృష్టి సారించే అధికారులను ఏర్పాటు చేయాలి.

– రావులపల్లి రాంమూర్తి, మాదిగ ఐక్యవేదిక కన్వీనర్, మణుగూరు

పల్లెల అభివృద్ధికి కృషి



మల్లెలమడుగులో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు, సర్పంచ్ కృష్ణవేణి

అశ్వాపురం: పట్టణాలకు దీటుగా పినపాక నియోజకవర్గంలోని పల్లెల అభివృద్ధికి అహర్నిశలూ కృషి చేస్తున్నానని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండలంలో బుధవారం ఎమ్మెల్యే రేగా కాంతారావు బుధవారం విస్తృతంగా పర్యటించారు. మండల పరిధిలోని గొల్లగూడెం, సీతరాంపురం, రామచంద్రాపురం, మల్లెలమడుగు, మొండికుంట గ్రామాలలో సుమారు రూ.70 లక్షలతో నిర్మించిన 13 సీసీ రోడ్లను ఎమ్మెల్యే రేగా ప్రారంభించారు. టేకులగుట్ట గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే రేగా సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మల్లెలమడుగు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రామాంజనేయస్వామి ఆలయం నిర్మాణ పనులను ఎమ్మెల్యే రేగా పరిశీలించారు. నెల్లిపాకలో ఇటీవల రాళ్లవాగుపై వంతెన నిర్మాణానికి రూ.1.80 కోటి మంజూరు కావడంతో రాళ్లవాగును ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయా గ్రామాలలో అనారోగ్య బాధితులను, మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే రేగా పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగా మట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ల ఆశీస్సులతో వందల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, మౌలిక సదుపాయాల కల్పనకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీటీస సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ వరప్రసాద్, ఎస్సై నాగుల్‌మీరా, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, సర్పంచ్‌లు చావ ఉమాదేవి, కాకా అశోక్, కోడి కృష్ణవేణి, మర్రి మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ గజ్జల లక్ష్మారెడ్డి, ప్రజాప్రతినిధులు, కందుల కృష్ణారున్ రావు, జాలె రామకృష్ణారెడ్డి, ఈదర సత్యనారాయణ, వీరారెడ్డి, మామిడి శ్రీను, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలి

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలో సింగరేణి కాలరీస్ కంపెనీకి అనుబంధంగా ఉన్న ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు శ్రమకు తగ్గ వేతనాలను చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య యాజమాన్యాలను డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులకు ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టర్లు వారి శ్రమను దోచుకుంటున్నారన్నారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతల్లో కీలకభూమిక పోషిస్తున్న ప్రైవేట్ కంపెనీల కార్మికుల పట్ల ఆయా యాజమాన్యాలు చిన్నచూపు చూడడం సరికాదన్నారు. కాంట్రాక్టర్ల ఇష్టారీతి వైఖరితో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకుని కార్మికుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట రమేష్, అక్కి నరసింహారావు, సీపీఐ నాయకులు ఎస్‌కె.సర్వర్, మంగి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జంతు సంక్షేమం అందరి బాధ్యత



అశ్వారావుపేటరూరల్: విద్యార్థికి బహుమతి అందిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

అశ్వారావుపేటరూరల్: జంతువుల సంక్షేమం అందరి బాధత అని, వాటిని కాపాడుకోవాలని అశ్వారావుపేట పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం తెలుగు మీడియం నుంచి ముగ్గురు, ఇంగ్లీష్ మీడియం నుంచి మరో ముగ్గురు విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులను ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.స్వప్న, సిబ్బంది పి.రేఖారాణి, ఎండి.మధార్, అశోక్, కె.దుర్గాభవాని, సీహెచ్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం దమ్మపేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాలను, పశు వైద్యాధికారి మన్యం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మన్యం రమేష్ మాట్లాడారు. జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, తహసీల్దార్ స్వామి, ఎంఈఓ కీసర లక్ష్మి, సర్పంచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ, పశువైద్య, పశు సంవర్ధక శాఖ ప్రాంతీయ పశువైద్యశాల భద్రాచలం వారి ఆధ్వర్యంలో బుధవారం జంతు సంక్షేమ పక్షోత్సవాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జిల్లా జంతు సంక్షేమ సంస్థ మెంబర్ ఎలపై ఉదయ్ కుమార్, డాక్టర్ ఎం.రవీంద్ర ఠాగూర్, ప్రాంతీయ వైద్యశాల సిబ్బంది, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పద్మజ, ఉపాధ్యాయ సిబ్బంది నిర్వహించారు.

108 వాహనం తనిఖీ

అన్నపురెడ్డిపల్లి: 108 అంబులెన్సులు ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉమ్మడి జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ సిబ్బంది ఆదేశించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన 108 అంబులెన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహన సిబ్బంది పనితీరును పరిశీలించి, పరికరాల వాడకం,ఔషదాల ఉపయోగం గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సకాలంలో 108 వాహనం ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త దుర్గా ప్రసాద్, ఏఎఫ్‌సీ రవికుమార్, 108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

మణుగూరురూరల్: బీసీలకు రిజర్వేషన్లను 27శాతం నుంచి 52శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. బీసీల కుల గణన ఆధారంగా విద్య, ఉద్యోగ, పారిశ్రామిక రంగాల్లో రిజర్వేషన్లను కల్పించాలన్నారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను 52శాతానికి పెంచాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాకా వెంకటేశ్వర్లు, అల్లెం కోటి, భాగవతపు సతీష్, ఇర్పా రవికుమార్, నల్లగట్ల రఘు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి

దుమ్ముగూడెం: జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని, మండలంలో జెండా ఎగురవేసే ప్రతి చోటా భారత రాజ్యాంగం పుస్తకం, అంబేడ్కర్ చిత్రపటం ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని దళిత శక్తి ప్రోగ్రాం మండల కన్వీనర్ సతీష్ మహారాజ్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా దళిత శక్తి ప్రోగ్రాం మండల కమిటీ అన్ని మండల కార్యాలయాలలో వినతి పత్రాలను ఇచ్చారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ సతీష్ మహారాజ్, చంటి మహారాజ్, రామ్ కరణ్ మహారాజ్, వినోద్, వంశీ పాల్గొన్నారు.

జయంతి వేడుకలు

అన్నపురెడ్డిపల్లి: మండలంలో భక్త రామదాసు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయ ప్రాంగణంలోని భక్త రామదాసు విగ్రహం వద్ద జయంతి వేడుకలను జరుపుకున్నారు. సర్పంచ్ బోడాపద్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, రామదాసు విగ్రహం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు చల్లపల్లి వెంకటేశ్వర్లు, సత్యం పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

చర్ల: మండలంలోని సుబ్బంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఎదిర గుట్టల వద్ద నిర్వహించనున్న సమ్మక్క–సారలమ్మల జాతర మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం తహసీల్దార్ బి.భరణిబాబు, ఆర్‌ఐ వరలక్ష్మి ఆవిష్కరించారు. చిన్నమేడారంగా ప్రసిద్ధిగాంచిన ఎదిరగుట్టల్లో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు నిర్వహించనున్న ఈ జాతర మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఈ సందర్భంగా తహసీల్దార్ భరణి బాబుతో పాటు, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు కోరారు.

ఓటు హక్కు ఎంతో విలువైంది..

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, తప్పనిసరిగా ప్రతిఒక్కరూ ఓటును నమోదు చేయించుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. అన్ని నియోజకవర్గాల్లో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. వ్యాసరచన, వకృత్వ, ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



అన్నపురెడ్డిపల్లి: జెడ్పీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ భద్రకాళి, విద్యార్థులు



మణుగూరురూరల్: ర్యాలీలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు



భద్రాచలంటౌన్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ..



అశ్వారావుపేటరూరల్: ముగ్గుల పోటీల విజేతకు బహుమతి అందిస్తున్న తహసీల్దార్ చల్లా ప్రసాద్



ములకలపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



దమ్మపేట: ముగ్గుల పోటీలను పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



దుమ్ముగూడెం: లక్ష్మీనగరంలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సభలతో చైతన్యం పెరిగింది



ప్రతినిధులతో ములకలపల్లి సర్పంచ్ బీబినేని వీరభద్రం

ములకలపల్లి: గ్రామపంచాయతీ స్థాయిలో నిర్వహిస్తున్న బాలసభ, మహిళా సభలతో వారిలో చైతన్యం పెరిగిందని ములకలపల్లి సర్పంచ్ బీబినేని వీరభద్రం అన్నారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న బాలసభ మరియు మహిళా సభల నిర్వహణలో భాగంగా ఎన్‌ఐఆర్‌డీ (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డవలప్‌మెంట్) హైదరాబాద్ నేతృత్వంలో 25వ జాతీయసదస్సు నిర్వహించారు. తెలంగాణాతోపాటు, ఆంధ్రప్రదేశ్, సిక్కిం, అస్సాం రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సులో, ములకలపల్లి సర్పంచ్ భద్రం మాట్లాడుతూ.. సభల అనుభవాలను వివరించారు. సభల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని ఆయన అభ్యర్థించారు. కేంద్ర పంచాయతీరాజ్, గ్రామాభివృద్ధిశాఖ కార్యదర్శి సునీల్‌కుమార్, ఎన్‌ఐఆర్‌డీ డైరెక్టర్ నరేంద్రకుమార్, తెలంగాణా రాష్ట్ర నోడల్ ఆఫీసర్ కె.నాగమణి, టీఎస్‌ఐఆర్‌డీ అధికారులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

భద్రాచలంటౌన్: తెలుగు రాష్ట్రాల్లో శ్రీ నరసింహ సేవావాహిని సంస్థ చేస్తున్న సేవ కార్యక్రమాలు అభినందనీయమని చిలుకూరి బాలాజీ ఆస్థాన పండితులు శ్రీమాన్ సౌందర్యరాజన్, రంగరాజన్ అన్నారు. పట్టణంలోని అహోబిల మఠం వద్ద బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న వారు సంస్థ వ్యవస్థాపకుడు కృష్ణచైతన్య స్వామికి చిలుకూరి బాలాజీ స్వామి వారి శేష వస్త్రాన్ని, పుష్పమాలను బహూకరించారు. కార్యక్రమంలో అహోబిలమఠం ప్రధాన అర్చకులు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి, శ్రీధర్ స్వామి భక్తులు పాల్గొన్నారు.

నియమాలు ఉపసంహరించుకోవాలి

చర్ల: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న ప్రజావ్యతిరేక అటవీ సంరక్షణ నియమాలు 2022ను ఉపసంహరించుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం చర్లలోని పార్టీ కార్యాలయంలో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువస్తున్న ఆ నియమాలను పార్లమెంట్‌లో ఆమోదించకుండా ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి కెచ్చెల కల్పన, డివిజన్ నాయకులు సాయన్న మండల కార్యదర్శి కొండా చరణ్, మండల నాయకులు లంకా వెంకట్, పాముల సాంబ, రేగా ఆంద్రయ్య, కొండా కౌశిక్ పాల్గొన్నారు.

నారాయణరెడ్డి సేవలు చిరస్మరణీయం

అశ్వాపురం: 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా ఎన్నో పాఠశాలల్లో ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన నారాయణరెడ్డి సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. ఇటీవల మరణించిన మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి దశదిన కర్మ, సంతాప సభను బుధవారం మొండికుంట గ్రామంలోని కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించగా వారు హాజరై నారాయణరెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. సంతాప సభలో పలువురు మాట్లాడారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, ఎంపీటీసీ కమటం నరేష్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దిన్, స్థానికులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



అశ్వారావుపేటరూరల్: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన బుధవారం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే పరిశీలించి, రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మన ఊరు–మన బడి పథకంలో భాగంగా చేస్తున్న పనులను తనిఖీ చేసి, పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంఈఓ పి.కృష్ణయ్య, హెచ్‌ఎం నరసింహారావు, బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, సత్యవరపు సంపూర్ణ పాల్గొన్నారు.

మండలంలో విస్తృత పర్యటన

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు బుధవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత మండపరిధిలోని చాపరాలపల్లి గ్రామంలో 'కంటివెలుగు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మలివిడత కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, తదుపరి గుట్టగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామచంద్రస్వామి ఆలయ పూజల్లో పాల్గొన్నారు. ఆపై ములకలపల్లిలో ఇటీవల మృతిచెందిన బిక్కుమళ్ల సత్యనారాయణ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

తెలంగాణాతల్లి సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హమాలీలు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. హమాలీ కార్మికుల కార్యాలయ నిర్మాణానికి మండలకేంద్రంలో స్థలం మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మెచ్చా.. తహసీల్దార్ వీరభద్రంతో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వస్థలం కేటాయించాల్సిందిగా సూచించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మట్ల నాగమణి, ఎంపీడీఓ ఆర్, చిన్ననాగేశ్వరరావు, ఎంపీఓ లక్ష్మయ్య ఆర్ఐ తారాచంద్, మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కల్యాణ్, ఎంపీటీసీలు శనగపాటి మెహరమణి, కొర్రి భద్రం, సర్పంచ్‌లు సున్నం సుధాకర్, కారం సుధీర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.